క్లుప్తంగా

సీనియర్ న్యాయవాది నాగ రాజరావు మృతి తీరని లోటు

నంద్యాల(వ్యవసాయం): సీనియర్ న్యాయవాది సూరా నాగరాజరావు(74) మృతి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. సోమవారం నాగరాజరావు స్వగృహానికి చేరుకొని ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ నాయకులు నాగరాజరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆటో నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



ఆటోనగర్‌లో రహదారుల దుస్థితిని చూపుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణ శివారు ప్రాంతమైన ఆటోనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆటోనగర్ ప్రాంతాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా మెకానిక్ పనులు చేసుకుంటూ కార్మికులు జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వారికి ఆటోనగర్‌లో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. సీసీ రోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వానకు కాలనీ మొత్తం బురదమయంగా మారిపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆటోనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

మాన్యం కౌలుకు వేలం



శ్రీరంగాపురంలో కౌలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం గ్రామం ఈశ్వర, శ్రీరామ, ఆంజనేయ, ఈశ్వరమ్మ ఆలయాల మాన్యం భూముల కౌలుకు దేవదాయ శాఖ అధికారులు సోమవారం వేలం పాట నిర్వహించారు. 19.99 ఎకరాల మాన్యంకు వేలం నిర్వహించగా రూ.3.42లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రామాంజనేయ శర్మ తెలిపారు. గతేడాది కంటే ఈసారి అదనంగా రూ.46 వేలు వచ్చిందన్నారు.

పచ్చదనం పెంచుదాం



రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రుద్రవరం: భావిరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. భారతీ ప్రకృతి సమాధాన సంఘటన అధ్యక్షురాలు శివమ్మ, వాసవీ రూరల్ డెవలప్‌మెంట్ వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రాగణం, బాలికల వసతి గృహ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురిసే సీజన్ కావడంతో మొక్కలు నాటితే సంరక్షించడం సులభమవుతుందన్నారు.

మానవత్వం చాటిన సీఐ



ఆత్మకూరు: బాపనంతపురం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను సీఐ రాము ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు. మంత్రి బాల వీరాంజనేయ స్వామి పర్యటన అనంతరం సీఐ ఆత్మకూరుకు వస్తుండగా మార్గమధ్యలో బాపనంతపురం గ్రామ సమీపంలో గేదెలు అడ్డుగా రావడంతో బైకుపై ప్రయాణిస్తున్న యువకులు కింద పడి గాయపడ్డారు. వడ్లరామాపురం గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, వెంకటేశ్వర్లు వెలుగోడు రిజర్వాయర్‌ను చూసి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సీఐ గమనించి వాహనాన్ని నిలిపి పోలీసు సిబ్బంది సహకారంతో వారిని ఆసుపత్రికి తరలించారు. సత్వరమే స్పందించి మానవత్వం చాటుకున్న ఆత్మకూరు సీఐ రాము, కానిస్టేబుల్ సాగర్‌ను గ్రామస్తులు అభినందించారు. గాయపడిన వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

బాబుది వంచన పాలన

- సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాల ప్రజలకు మోసం
- ఏడాది గడిచినా అమలు కాని హామీలు
- కూటమి సర్కారు వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి వివరించండి
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీలో శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది వంచన పాలన అని అధికారం కోసం ఎన్నికల ముందు మాయమాటలు చెప్పారని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బసవేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులను ఉద్దేశించి శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడారు. సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను వంచించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. 2014లో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ అని నమ్మించి మోసం చేశారన్నారు. 2024లో సూపర్‌సిక్స్ పేరుతో దగా చేశారన్నారు. అధికారం కోసం ఆయన మోసపూరిత హామీలు ఇస్తుంటారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల దాటిన మహిళలకు ప్రతి నెల రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలు ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్, వసతి దీవెన, విద్యాదీవెన ఇవన్ని ఎక్కడ అమలు చేశారో చెప్పాలన్నారు. ఏం చేశారని తెలుగుదేశం నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు అంటూ జనంలోకి వెళ్తున్నారని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకానికి పలు ఆంక్షలు పెట్టి కోత విధించారన్నారు. రాష్ట్రంలో యూరియా ఎక్కడికి పోతుందో అర్థం కాని పరిస్థితి అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు ఇవ్వరు కానీ మద్యం మాత్రం ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటింటికి రేషన్ పంపిణీ విధానాన్ని కూటమి సర్కారు ఎత్తివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు కొత్త పింఛన్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ విషయాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బాబు చెప్పిన హామీలను ఒకసారి గుర్తు చేయాలన్నారు.

మోసం.. బాబు నైజం..

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. గోద్రా అల్లర్ల తర్వాత బీజేపీతో ఉండటం చారిత్రక తప్పిదమని చెప్పి గత ఎన్నికల్లో బీజేపీతో కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల్లోకి వచ్చారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టారన్నారు. ఇలా ప్రతి ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పడం మోసం చేయడం చంద్రబాబుకు అలవాటు అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులెవరూ కూటమి సర్కారు బెదిరింపులకు భయపడరని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా, డాక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ ప్రభాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, శివనాగిరెడ్డి, రసీద్, ఎల్లయ్య, షఫీ, బాలుడు, అనిల్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రంగారావు, సోషల్ రెడ్డి, పాల మాబు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, రామ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులకు బెదరం

నంద్యాల: కూటమి ప్రభుత్వం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై బనాయిస్తున్న తప్పుడు కేసులకు బెదరమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డిని అన్యాయంగా లిక్కర్ కేసులో ఇరికించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు మాయమాటలు చెప్పారన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో హామీలు గుప్పించారన్నారు. వాటిని అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, కేసులతో భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ నాయకులు మూల్యం చెల్లించక తప్పదన్నారు. కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడాది దాటినా ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేయడమే కూటమి నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు.

ఊరూరా బెల్టుషాపులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా ఓ బెల్టు షాపు ఉండేది కాదని, కూటమి ప్రభుత్వం రాగానే ఊరూరా బెల్టుషాపులు కనిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే శిల్పా ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని ప్రజారోగ్యం సర్కారుకు పట్టడం లేదన్నారు. అలాగే కూటమి సర్కారు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి నిబంధనల పేరుతో లక్షలాది మందికి ఎగనామం పెట్టిందన్నారు. దమ్ముంటే ఎంతమంది తల్లులకు వారి ఖాతాల్లో నగదును బదిలీ చేశారో చెప్పాలన్నారు. నంద్యాల నియోజకవర్గంలో వార్డుల వారీగా జగన్ ప్రభుత్వంలో ఎంత మందికి అమ్మ ఒడి వచ్చింది..టీడీపీ ప్రభుత్వంలో ఎంత మందికి తల్లికి వందనం వచ్చిందో లెక్కలతో సహా వివరించారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృత రాజ్, జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు టీవీ రమణ, కౌన్సిలర్లు విజయభాస్కర్, సాధిక్ బాషా, మాజీ కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, జలీల్, కాల్వ నాగరాజు, ఎర్రన్నలు పాల్గొన్నారు.

సంక్షేమ గృహాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలోని సంక్షేమ గృహాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో వివిధ అంశాలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత జిల్లా అధికారులు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపైఅవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉంటే వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీ-4 బంగారు కుటుంబాల చేయూత కోసం మార్గదర్శులను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన గ్రామసభలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మట్టి గృహాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.సమావేశంలో డీఆర్‌ఓ రాము నాయక్, ఆర్‌డీఓలు, ఎస్‌డీసీ లు,వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,డివిజన్ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట పైర్లతో భూసారం పెంపు

నంద్యాల: భూసారం పెంపునకు పచ్చి రొట్ట పైర్లను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రైతులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చి రొట్ట పైర్ల వాడకానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఎరువులు, పురుగుమందు వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సోమవారం మత్తు పదార్థాల వ్యసనం-పర్యావసనం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిలకు గురికారాదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి శివారెడ్డి, అధికారులు శ్రీకాంత్ రెడ్డి, శ్యాంబాబు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని తెలిసి తెలియని వయస్సులో మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ అన్నారు. రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వినియోగం - వాటి వల్ల కలిగే అనర్థాలపై పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు శరీరాన్ని చిత్తుచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జయప్ప ఉన్నారు

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

శిరివెళ్ల: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ చిన్న పీరయ్య అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుట్కా, సిగరెట్లు తదితరవి తీసుకోవడం వల్ల జీవితాలు నాశన మవుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందరాజులు, టీచర్లు పాల్గొన్నారు.

చెంచు గిరిజన రైతుపై పెద్దపులి దాడి

ఆత్మకూరురూరల్: కొత్తపల్లె మండలం చదరంపెంట చెంచుగూడేనికి చెందిన అంకన్న అనే యువకుడిపై సోమవారం సాయంత్రం పెద్దపులి దాడి చేసింది. దీంతో అతని చేతిపై పులి గోర్లు గీసుకు పోవడంతో స్వల్పంగా గాయపడ్డాడు. నల్లమల అడవుల్లో లోతట్టు ప్రాంతంలో ఉన్న చదరం పెంట గూడెం వాసులు కొంత కాలంగా అక్కడ నివాసాలు ఖాళీ చేసి అడవి అంచుల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న గూడెంలో ఉంటున్నారు.అయితే గూడెం వాసులకు పాత గూడెం వద్ద సుమారు 150 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. పంట కాలాల్లో చెంచులు తమ పొలాలకు వస్తూ పోతూ ఉంటారు. ఆ క్రమంలో గూడేనికి చెందిన అంకన్న, మరో యువకుడు కలసి తమ పొలం వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే ముందు అంకన్న బహిర్భూమికి చెట్ల చాటుకు వెళ్లాడు. అక్కడ కూర్చున్న అంకన్నపై పెద్దపులి హఠాత్తుగా పొదల్లోంచి అతనిపైకి దూకింది. దీంతో అంకన్న పెద్దగా కేకలు వేస్తు పొలం వైపు పరుగులు తీశాడు. కాని అప్పటికే పులి పంజా ఆయన చేతిని రాసుకుంటూ పోవడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వారు గట్టిగా కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి వెళ్లి పోయింది. గాయం చిన్నదే కావడంతో గూడెంలోనే ఆకు పసురుతో వైద్యం చేసుకున్నట్లు తెలిసింది. అటవీ అధికారులకు సమాచారం అందడంతో వారు సంఘటనా స్థలానికి మంగళవారం ఉదయం వెళ్లి పులి అడుగు జాడలు పరిశీలించనున్నట్లు సమాచారం.

నానో ఎరువులను వినియోగించుకోవాలి

దొర్నిపాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు యూరియా కొరత ఏర్పడకుండా పంటలకు నానో ఎరువులను వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలన్నారు. ఏ పంట సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయి, ఎరువులు ఏ మోతాదులో వాడాల్లో తెలుస్తుందన్నారు. ఇష్టం వచ్చినట్లు ఎరువులు వాడితో నేల స్వభావం దెబ్బతిని భవిష్యత్ తరాలకు సాగుకు నేల అనుకూలించదన్నారు. ప్రతి రైతు పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు వెంకటేశ్వరరెడ్డి, ప్రమీల పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ బస్టాండు సమీపంలో రోడ్డుపై అడ్డంగా నిలిపిన భారీ వాహనాలు

పిల్లలూ భద్రం

- రోడ్డుపైనే భారీ వాహనాలు పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ, మాయలూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉయ్యాలవాడ బస్టాండు సమీపంలో, అలాగే ఆర్.జంబులదిన్నె, భీమునిపాడు రహదారిలో ఉయ్యాలవాడ మెయిన్ బజార్‌లో వాహనాలు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తున్నారు. వాహనాలు పక్కకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోతోంది. ఈ రహదారిలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్ ఉంది. ఈ పాఠశాలలకు దాదాపు 500 మందికి పైగా విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లి వస్తుంటారు. రోడ్డుపై ఇష్టారాజ్యంగా భారీ వాహనాల పార్కింగ్ పాఠశాలకు వెళ్లే సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్షిప్తం

హోలీక్రాస్ కెథడ్రల్ ఎన్నికల ఫలితాలు విడుదల

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ పరిధిలోని పాస్టరేట్-1 హోలీక్రాస్ కెథడ్రల్ చర్చికి సంబంధించిన కార్యనిర్వాహక కమిటీ సభ్యుల త్రైవార్షిక ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎన్నిక అధికారి పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్ పర్యవేక్షణలో కౌంటింగ్ జరగగా ప్రభుదాస్ యూత్ ప్యానల్ విజయం సాధించింది. అలాగే పాస్టరేట్-2 ఆలయ కమిటీ ఎన్నికల్లో బాలయ్య ప్యానల్ గెలిచినట్లు డీనరీ చైర్మన్, ఎన్నికల అధికారి ఇమ్మానియేల్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి పోతుగంట రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులను ప్రకటించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్వీ రమణ(డోన్), సుధాకర్ (నంద్యాల), చాందీని (బనగానపల్లె), దుప్పటి ముళీధర్‌చౌదరి (శ్రీశైలం), ఉపేంద్రనాథరెడ్డి (నంద్యాల), పసుపుల రవీంద్రకుమార్ (నంద్యాల)లతో పాటు జిల్లా జనరల్ సెక్రటరీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టె చంద్రశేఖర్, భరత్‌కుమార్, ప్రియారెడ్డి, శంకర్‌గౌడ్, రోజమ్మ, జయలక్ష్మి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

ఆళ్లగడ్డ: పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సోమవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని సూచించారు. మద్యం దుకాణాలను తరుచు విజిట్ చేయాలని ఆదేశించారు. అలాగే పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు

మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం వెండి రథోత్సవాన్ని నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు చేపట్టారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారిని అరెస్ట్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని నమ్మించి గిరిజనుల ఆధార్ కార్డు తీసుకొని కోట్లు మింగేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే బాలునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులను రికవరీ చేసి అమాయక గిరిజనులను న్యాయం చేయాలన్నారు.

కార్మికుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం



కార్మికుల సమ్మెకు మద్దతు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ముందుండి పోరాడుతుందని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి కార్మికులకు భరోసా ఇచ్చారు. సోమవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించాలన్నారు. వారి విజ్ఞప్తి మేరకు కనీస వేతనం రూ.26వేలు అందించి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, కౌన్సిలర్ ఆరీఫ్‌బాషా, మాజీ కౌన్సిలర్ జాకీర్‌హుసేన్, నాయక్, జలీల్‌బాషా, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలదుర్గన్న, భాస్కరాచారి, మహిళలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఏఓ వెంకటేశ్వర్లు


నంద్యాల(అర్బన్): జిల్లాలో ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్లతో ఎరువుల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హోల్‌సేల్ డీలర్లు ఎరువులను రిటైల్ డీలర్లందరికీ అవసరమైన మేరకు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో 2వేల టన్నుల యూరియా, 1200 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని, ఈ వారంలో జిల్లాకు 3,500 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ, మార్క్‌ఫెడ్ ఎండీ హరినాథరెడ్డి, ఏఓ ప్రసాదరావు, శారదా, తదితరులు పాల్గొన్నారు.


గడువులోపు పనులన్నీ పూర్తి కావాలి



మాట్లాడుతున్న సీఈ అశోక్‌కుమార్

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్ (ఏపీఆర్‌ఆర్‌పీ) కింద మంజూరైన పనులన్నీ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని సంబంధిత అధికారులను ఆ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏపీఆర్‌ఆర్‌పీ రోడ్ల పురోగతిపై సీఈ కార్యాలయ ఈఈ రమణమూర్తితో కలసి అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో అనంతపురంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. అనంతపురం సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, పీఏ రాజేంద్ర ప్రసాద్, పీఐయూ ఈఈ నవీన్ కుమార్, ఈఈలు శంకరయ్య, రఘునాథరెడ్డి, డీఈఈలు, ఏఈఈలు హాజరయ్యారు. నాలుగేళ్లలో అనంతపురం జిల్లాకు సంబంధించి రూ.209 కోట్లతో 138 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 52 పనులు పూర్తయ్యాయని, 42 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా, 44 పనులు రద్దయినట్లు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. మొత్తం రూ.101 కోట్లు ఖర్చు పెట్టి 195.71 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించినట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాకు రూ.230 కోట్లతో 194 పనులు మంజూరు కాగా, 119 పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు వివరించారు. 28 పనులు వివిధ దశల్లో ఉండగా, 47 పనులు రద్దయ్యాయని తెలిపారు. మొత్తం 193.91 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరిస్థితిపైనా ఆయన సమీక్షించారు. అనంతరం ఆయా జిల్లాల ఇంజినీరింగ్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. గడువులోపు పనులన్నీ పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు.





రుద్రవరం వద్ద మొక్క జొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు, దొర్నిపాడు శివారులో నీటమునిగిన మినుము

దెబ్బతింటున్న పంటలు

దొర్నిపాడు/రుద్రవరం: వారం రోజులుగా కురుస్తున్న వర్షం ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మినుము, మొక్కజొన్న పంట పొలాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఆయా పంటల రంగు మారుతోంది. మండలంలో తొలిపంటగా మినుము 650 హెక్టార్లు, మొక్కజొన్న 430 హెక్టార్ల వరకు సాగుచేశారు. అవసరానికి మించి వర్షం పడుతుండటంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- రుద్రవరం మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించగా పంటపొలాల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. రుద్రవరం, అప్పనపల్లె దారివైపు పంట పొలాలు జలమయమయ్యాయి.